

ప్రకృతి సాగు దిశగా..

తెలుగు రాష్ట్రాల్లో రైతులు ప్రకృతి సాగుపై పట్టు సాధిస్తున్నారు. కొత్త కొత్త వంగడాలతో సత్ఫలితాలు సాధిస్తున్నారు. 10లో ▸



పన్నులు ఎగ్గొడుతున్నారు

కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నా జీపీలకు చెల్లించాల్సిన పన్నులను సెల్ టవర్ సంస్థలు ఎగ్గొడుతున్నాయి. 10లో ▸



ఎన్నాళ్లీ నిరీక్షణ?

అధికారులు లేక తహసీల్దార్ కార్యాలయం వెలవెలబోతోంది. దీంతో రిజిస్ట్రేషన్లకు అంతరాయం కలుగుతోంది. 11లో ▸

పంద్రాగస్టుకు సర్వం సిద్ధం

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

- కలెక్టరేట్ కార్యాలయ మైదానంలో వేడుకలు
- ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

వికారాబాద్: జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. సోమవారం కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి.. జిల్లా ఉన్నతాధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టరేట్ మైదానంలో ఉదయం 11.00 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ హాజరుకానున్నారు.. జాతీయ పతాకావిష్కరణ, పలు ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించాలని నిర్ణయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేయనున్నాయి. ఉత్తమ సేవలందించిన జిల్లా అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేయనున్నారు. కరోనా నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కలెక్టర్ సూచించారు.

కార్యక్రమాల వివరాలు

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల షెడ్యూల్‌ను కలెక్టర్ కార్యాలయ అధికారులు విడుదల చేశారు. ఉదయం 10.52 గంటలలోపు జిల్లాస్థాయి అధికారులు, సిబ్బంది కలెక్టరేట్‌కు చేరుకోవాలి. 10.55 నిమిషాలకు కలెక్టర్, ఎస్పీ వేడుకలు జరిగే మైదానానికి చేరుకుంటారు. 11.58 నిమిషాలకు ముఖ్యఅతిథి వినోద్‌కుమార్ హాజరవుతారు. 11.00 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ, 11.05 నిమిషాలకు గౌరవ వందనం స్వీకరిస్తారు. 11.10 ముఖ్యఅతిథి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 11.30 శకటాల ప్రదర్శన, 11.40కి సాంస్కృతిక కార్యక్రమాలు, 12.10కి అవార్డుల ప్రదానం, 12.30 గంటలకు పలు ప్రభుత్వ శాఖల స్టాళ్ల ప్రదర్శన, 11.35 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగియనుంది.

ఘనంగా నిర్వహించాలి

స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. అంతకుముందు వీవీపీ గ్యాలరీ, మైక్, గ్రౌండ్ సుందరీకరణ పనులను పరిశీలించారు. పోలీసుల పరేడ్ రిహార్సల్స్‌ను తిలకించారు. వేడుకల అనంతరం అతిథులు బస చేసే ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అతిథి గృహంలో పారిశుద్ధ్య పనులతో పాటు మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు.



స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారుల బృందం

న్యూస్‌రీల్

‘ప్రజావాణి’కి 144 అర్జీలు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

వికారాబాద్ అర్బన్: ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, లింగ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజవాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి 144 అర్జీలు అందినట్లు కలెక్టర్ తెలిపారు.

అన్ని వర్గాలను ఆదుకుంటాం

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటామని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 23 మంది బీసీ కులవృత్తి దారులకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీ బంధు మొదటి విడతలో భాగంగా కులవృత్తి దారులకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకెళుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ని గెలిపించి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం మండలంలోని హస్నాబాద్‌లో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, మాజీ సర్పంచు రమేష్‌బాబు, హస్నాబాద్ సర్పంచు పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిగి ఆర్టీసీ డీఎంగా కరుణశ్రీ



బాధ్యతలు స్వీకరిస్తున్న కరుణశ్రీ

పరిగి: పరిగి ఆర్టీసీ డీఎంగా కరుణశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన పవిత్ర పదోన్నతిపై ఖమ్మం డిప్యూటీ ఆర్‌ఎంగా వెళ్లారు.ఫరూక్‌నగర్ సీఐ గా విధులు నిర్వహిస్తున్న కరుణశ్రీ పదోన్నతిపై పరిగికి వచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు.

బీజేపీకి పట్టణ ఇన్‌చార్జ్ రాజీనామా



మరాఠి శివప్రసాద్

వికారాబాద్ అర్బన్: బీజేపీకి మాజీ మంత్రి చంద్రశేఖర్ రాజీనామా చేయడంతో ఆయన ప్రధాన అనుచరులు కూడా అదే బాట పట్టారు. పార్టీ పట్టణ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఎం శివప్రసాద్, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుచ్చిరెడ్డి సోమవారం పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాల కోసం కష్టపడి పనిచేస్తున్నా కొంత మంది నాయకులు తమను ఎదగనీయడం లేదని ఆరోపించారు. పైగా కొంతమంది సీనియర్ నాయకులు బీఆర్‌ఎస్ కోవర్టులుగా పని చేయడంతో పార్టీకి తీవ్ర నష్టం జరిగినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి ఇప్పటి వరకు ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై మాట్లాడకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేయకపోవడంతోనే బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు.

10 రోజులు 12 రూ.కోట్లు



మద్యం దుకాణాలకు దరఖాస్తుల ‘కిక్కు’

పలు షాపులకు పోటాపోటీ

- మరో మూడు రోజుల్లో ముగియనున్న గడువు
- అప్లికేషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం

దరఖాస్తులు ఇలా..

ఎక్సైజ్‌జిల్లా	షాపులు	వచ్చిన దరఖాస్తులు
సరూర్‌నగర్	134	2,700
శంషాబాద్	100	3,300
వికారాబాద్	59	907

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మద్యం షాపులకు దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో గడువు ముగియనుండడంతో దరఖాస్తులు దాఖలు చేసేందుకు సోమవారం క్యూకట్టారు. సరూర్‌నగర్ ఎక్సైజ్ జిల్లా పరిధిలో 134 షాపులు ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 2,700పైగా దరఖాస్తులు వచ్చాయి. శంషాబాద్ ఎక్సైజ్ జిల్లా పరిధిలో వంద షాపులు ఉండగా, 3,300 వచ్చాయి. ఇన్నర్‌రింగ్‌రోడ్డుకు అటు ఇటుగా ఉన్న ఒక్కో షాపునకు సగటున 25 దరఖాస్తులు రావడం విశేషం. ఎలాగైనా షాపులను దక్కించుకోవాలనే ఉద్దేశంతో కొంతమంది వ్యాపారులు సిండికేట్‌గా మారి.. బినామీ పేర్లతో ఒకే షాపుపై టెండర్లు దాఖలు చేస్తున్నారు. ఒకరు టెండరు వేసిన చోట మరొకరు వేయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇలా ఇప్పటి వరకు కేవలం ఈ దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి సుమారు రూ.12 కోట్ల ఆదాయం సమకూరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నెల 18తో దరఖాస్తుకు గడువు ముగియనుంది. వచ్చే చివరి మూడు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. శేకిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాపులకు దరఖాస్తులు భారీగా వచ్చాయి. ఈ ఒక్క స్టేషన్ పరిధిలోనే 1,700 పైగా రావడం గమనార్హం.



21న లక్కీడ్రా

మద్యం షాపుల లైసెన్సుల గడువు నవంబర్ 30తో ముగియనుంది. డిసెంబర్ నుంచి కొత్త లైసెన్సుల విధానం అమల్లోకి రావాల్సి ఉంది. అంతకు ముందే సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో ప్రభుత్వం అప్రమత్తమై ముందస్తు లైసెన్సుల జారీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 4న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది. ఒక్కో దరఖాస్తుకు ఫీజు రూ.2 లక్షలుగా(నాన్ రిఫండబుల్) నిర్ణయించింది. ఈ పది రోజుల్లోనే 234 షాపులకు 6,000 దరఖాస్తుల అందడం విశేషం. గతంలో మాదిరే ఈసారి కూడా గౌడ, ఎస్సీ, ఎస్టీ కులాలకు రిజర్వేషన్లు వర్తింపజేసింది. ఈ మేరకు లాటరీ ద్వారా ఆయా కులాలకు కేటాయించే షాపుల సంఖ్యను నిర్ధారించింది. ఈ నెల 21న శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్‌లో లక్కీడ్రా నిర్వహించనుంది. ఈ డ్రా ద్వారా దరఖాస్తుదారులకు షాపులను కేటాయించి, ఆయా షాపులకు 30న కొత్త సరుకును అందజేయనుంది.

రిజర్వేషన్ల వారీగా వైన్‌షాపుల కేటాయింపు ఇలా..

ఎక్సైజ్ జిల్లా	గౌడ్స్	ఎస్సీ	ఎస్టీ	ఓపెన్ కేటగిరీ
హైదరాబాద్	5	4	1	70
సికింద్రాబాద్	6	7	1	85
మల్కాజిగిరి	12	7	1	68
మేడ్చల్	11	5	1	97
సరూర్‌నగర్	25	11	2	96
శంషాబాద్	9	6	-	85
వికారాబాద్	6	9	2	42



చేవెళ్ల సభ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి, డీసీసీ అధ్యక్షుడు

లక్ష మందితో చేవెళ్ల సభ

- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఇక్కడి నుంచే ప్రకటిస్తాం
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

చేవెళ్ల: చేవెళ్లలో లక్ష మందితో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. పట్టణంలో ఈ నెల 18న నిర్వహించనున్న బహిరంగ సభ విజయవంతం కోసం సోమవారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఫయ్యూమ్, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్ యాదవ్‌లతో కలిసి చేవెళ్లలో రెండు స్థలాలను పరిశీలించారు. షాబాద్ రోడ్డులోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్, పట్టణంలోని కేవీఆర్ గ్రౌండ్‌ను పరిశీలించారు. వీటి వివరాలను పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి సభను విజయవంతం చేస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఇక్కడి నుంచే ప్రకటించనుండడం సంతోషంగా ఉందన్నారు.

ఏసీఆర్‌కు చేవెళ్ల టికెట్ ఇవ్వొద్దు


బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరనున్న వికారాబాద్ జిల్లాకు చెందిన ఏ చంద్రశేఖర్ చేవెళ్ల టికెట్ ఇవ్వద్దని, స్థానిక నాయకులకే కేటాయించాలని వసంతం, షాబాద్ దర్శన్, పామెన బీంభరత్ మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ దృష్టికి తెచ్చారు. ఈ విషయం అధిష్టానం చూసుకుంటుందని, వారి నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, సీనియర్ నాయకులు జనార్దరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి, పీఏసీఎస్ చైర్మన్లు డీ వెంకట్‌రెడ్డి, జీ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన వంగడాలు కనుక్కోవాలి

- హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమ్లేష్ పటేల్

నందిగామ: వ్యవసాయ రంగంలో ఆధునిక వంగడాలు, ఆధునిక పద్ధతులను కనిపెట్టాల్సిన బాధ్యత యువ శాస్త్రవేత్తలపై ఉందని శ్రీరామ చంద్ర మిషన్ (హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ) గురూజీ కమ్లేష్ పటేల్ అన్నారు. మండలపరిధిలోని కాన్హా శాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)తో కలిసి కన్నడ యువ వ్యవసాయ శాస్త్రవేత్తలను ప్రోత్సహించడం కోసం సోమవారం ఆగ్రో యూత్ సమ్మిట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమ్లేష్ పటేల్ మాట్లాడుతూ.. దేశ యువతలో వ్యవసాయ రంగానికి సంబంధించిన సాధికారతను పెంపొందింపజేసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలకు సరైన శిక్షణ ఇవ్వడంతో పాటు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకునేందుకు వారిని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని వివరించారు. ఈ సమ్మిట్ మంగళవారంతో ముగుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జాతీయ మీడియా కో ఆర్డినేటర్ చేతన్ గోనాయక్, మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.సురేష్‌చంద్ర, కర్ణాటక వ్యవసాయ యువ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆదివాసీలపై బీఆర్‌ఎస్ వివక్ష



అనంతసాగర్‌లో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

- చెంచులను నిర్లక్ష్యం చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం
- కాంగ్రెస్ వస్తేనే మళ్లీ మంచిరోజులు
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: ఆదివాసీలపై సీఎం కేసీఆర్ సర్కారు వివక్ష చూపుతోందని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు.మండల పరిధిలోని అనంతసాగర్, కుస్మసముద్రం గ్రామాల్లో సోమవారం చెంచు ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే చెంచులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని తెలిపారు. ఇందుకోసం ఐటీడీఏను ఏర్పాటు వారి అభ్యున్నతికి కృషిచేసిందన్నారు. కానీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐటీడీఏను చెంచులకు దూరం చేసిందని ఆరోపించారు. చెంచులు, బంజారాల మధ్య గొడవలు సృష్టించి అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. చెంచులకు పథకాలు లేకుండా చేసి వారిని నిర్లక్ష్యానికి గురిచేస్తోందని మండిపడ్డారు. మళ్లీ కాంగ్రెస్ వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్ టు అధ్యక్షుడు కర్రె భరత్ కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, నాయకులు మహేశ్, షర్ఫొద్దీన్, రాంచందర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ

- మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మార్పులు తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి సిర్లాహిల్స్‌లోని ప్రాథమిక పాఠశాలలో రూ.38 లక్షలతో చేపట్టిన భవన పునర్నిర్మాణ పనులకు సోమవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో సమస్యలు ఉండేవని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక వాటిని బాగు చేసుకోవడంతో పాటు విద్యార్థుల స్థితిగతులు మార్చేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అందులో భాగంగానే కేజీ టూ పీజీ విద్య, గురుకులాలకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల మంది పిల్లలకు విద్య అందిస్తూ ఒక్కో విద్యార్థికి రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తోందని తెలిపారు. మనబస్తీ–మనబడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చేసి సకల సౌకర్యాలను కల్పిస్తోందని వివరించారు. తొలిమెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ముందే పుస్తకాలు అందజేసి ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నెలలో ఒకసారి పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసుకుని తల్లిదండ్రులను భాగస్వాములను చేసి విద్యార్థుల స్థితిగతులను వివరించాలని మంత్రి సూచించారు. అనంతరం 30 మంది దివ్యాంగ బాల,బాలికలకు మంత్రి సహాయ పరికరాలు, ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, డీఈఓ సుశీందర్ రావు, ఎంఈఓ కృష్ణయ్య, స్థానిక కార్పొరేటర్ భిక్షపతిచారి, ప్రధానోపాధ్యాయులు గంగాధర్ పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ విజయపురి కాలనీలో రూ.5.98 కోట్లతో నిర్మించ తలపెట్టిన ట్రంక్‌లైన్ నిర్మాణ పనులు, రూ.31 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తాతో కలిసి మంత్రి సబితా రెడ్డి శంకుస్థాపన చేశారు.

నేడు ఫ్రీడమ్ రన్

గోల్కొండ: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా మంగళవారం ఫ్రీడమ్ రన్ నిర్వహిస్తున్నామని తెలంగాణ ఫ్యామిలీ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు గోల్కొండ బంజారా దర్వాజ సమీపంలోని డక్కన్ పార్కులో ఈ ఫ్రీడమ్ రన్ నిర్వహిస్తున్నామన్నారు.

ప్రకృతి సాగు దిశగా అడుగులు

ఆర్ఎన్ఆర్-15048 వరిరకంతో అధిక దిగుబడి

- డయాబెటిస్ కంట్రోల్‌లో ఉంటుందంటున్న శాస్త్రవేత్తలు
- ఆసక్తి చూపుతున్న రైతులు

కొడంగల్ రూరల్: అన్నపూర్ణగా పిలువబడే తెలుగు రాష్ట్రాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు ఎక్కువగా వరిపంట సాగుచేస్తారు. రెండు రాష్ట్రాల్లో వరి పంటను పండించని గ్రామాలు ఉండవంటే అతిశయోక్తికాదు. వరి పంటకు సంబంధించి ఇప్పటికే ఎంతోమంది శాస్త్రవేత్తలు కొత్త-కొత్త రకాలను కనిపెట్టడం జరిగింది. ఈ క్రమంలో రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి రూపొందించబడ్డ రకం ఆర్ఎన్ఆర్-15048. ఈ రకం బియ్యంతో డయాబెటిస్(షుగర్) కంట్రోల్ అవుతుందని చెబుతున్న శాస్త్రవేత్తలు ఇటీవల ట్రయల్‌రన్‌లో నిరూపించారు. దీంతో చాలామంది రైతులు ఆర్ఎన్ఆర్-15048 రకం సాగుపై మక్కువ చూపిస్తున్నారు. ఈ క్రమంలో హస్నాబాద్ గ్రామానికి చెందిన రైతులు మూడేళ్లుగా ఈ రకం వరిని సాగుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. హస్నాబాద్ గ్రామానికి చెందిన రైతులు రమేష్, రాకేష్‌గౌడ్ చెరో రెండు ఎకరాల్లో ఈ రకం వరిని సాగుచేస్తున్నారు. ఒక ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు ధాన్యం దిగుబడి రాగా వీటిని మిల్లులో బ్రౌన్ రైస్‌గా తయారుచేసిన అనంతరం 10 క్వింటాళ్ల బియ్యం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వస్తుందని తెలిపారు. అలాగే తక్కువ మోతాదులో మందులు వాడటం, సేంద్రియ ఎరువులు వాడుతున్నట్లు రైతులు తెలిపారు.



హస్నాబాద్‌లో సాగుచేసిన ఆర్ఎన్ఆర్-15048 రకం వరి

ప్రకృతి వ్యవసాయం దిశగా..

సేంద్రియ పద్ధతిలో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధిస్తూ ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. ప్రారంభంలో కరిగెటలో కానుగ పారక, జీలుగతో కలియదున్నడం ద్వారా పచ్చిరొట్ట మాదిరిగా పొలంలో భూసారం పెరుగుతుందని, అలాగే సేంద్రియ ఎరువులను వాడాలని చెబుతూ తోటి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రసాయనిక మందులను తక్కువ మోతాదులో వాడుతూ మెజార్టీ పర్సంటేజ్ సేంద్రియ ఎరువులను వాడుతున్నట్లు పేర్కొంటున్నారు. పంట దిగుబడి ఎక్కువ రావాలంటే కానుగ ఆకులు, జీలుగను కరిగెటలో కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందని, నాటు వేసే ఒకరోజు ముందు ఆర్గానిక్(నల్లమందు, బూడిద) ఎరువును పొలంలో వేయడం ద్వారా భూసారం పెరుగుతుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగిందని విరివిగా రసాయన మందులు వాడుతుండటంతో ఖర్చు ఎక్కువగా వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానుగ పారక, జీలుగతో భూసారం పెరుగుతుండడంతో కేవలం 30శాతం రసాయన మందుల పిచికారీతో పంటలు చేతికొచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

రెండెకరాల్లో సాగు



ఆర్ఎన్ఆర్-15048 వరి సాగును రెండేళ్లుగా సాగు చేస్తున్నాను. ఈ రకం బియ్యంతో వండిన అన్నం చాలా రుచిగా ఉంటుంది. శరీరంలో 51శాతం డయాబెటిస్‌ను తగ్గిస్తుందని ట్రయల్‌రన్‌లో శాస్త్రవేత్తలు నిరూపించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి రావడంతో ప్రస్తుతం రెండు ఎకరాల్లో సాగుచేస్తున్నాను. గతంలో కొనుగోలు చేసినవారు ప్రస్తుతం రెట్టింపు కావాలని అడుగుతున్నారు.

– రమేష్, రైతు, హస్నాబాద్

హామీల అమలులో విఫలం

మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందగానే రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేసి మహిళలకు ఆర్థిక చేయూతనిస్తామని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ధారూరు మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని సీఎం కేసీఆర్ గాలికొదిలేసారన్నారు. హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం, కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీ సీరాములు, ఎంపీటీసీ రవి, సర్పంచ్ అనిల్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాకాన్, ఎల్.అశోక్ ముదిరాజ్, చెన్నారెడ్డి, అవినాష్‌రెడ్డి, బుజ్జయ్యగౌడ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు అధిక ప్రాధాన్యత..

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ యువతకు అధిక ప్రాధాన్యతనిస్తుందని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు రితిక్ రెడ్డి అన్నారు. సోమవారం కుల్కచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ యువజన సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉద్యోగాలు భర్తీచేయకపోవడంతో పీజీలు చేసిన నిరుద్యోగులు ఉపాధిహామీ పనులకు, భవన నిర్మాణ పనులకు వెళ్తున్న పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున ఉద్యోగాలను భర్తీచేసి యువతకు అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు భీంరెడ్డి, కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు, చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, బ్లాక్-2 అధ్యక్షుడు భరత్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.



అల్లాపూర్‌లో కాంగ్రెస్ నేతల పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న మహిళలు









ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్

ముగ్గురికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో చిన్నారులు

కుల్కచర్ల: ఓ బైక్ ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు చిన్నారులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. కుల్కచర్ల మండల పరిధిలోని ఘనపూర్ గేటు సమీపంలో ట్రాక్టర్ టైర్ పంక్చర్ కావడంతో సదరు డ్రైవర్ రోడ్డుపైనే ఒక పక్కకు ట్రాక్టర్ పెట్టి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో బైక్‌పై కుల్కచర్ల నుంచి బిండెంగడ్డ తండాకు బైక్‌పై వెళ్తున్న బిండెంగడ్డ తండా పంచాయతీకి చెందిన సచిన్, మరో ఇద్దరు చిన్నారులు ఆగిఉన్న ట్రాక్టర్‌ను వెనకాల నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్య సిబ్బంది అందుబాటులో లేరు. 108 అంబులెన్స్ కూడా అందుబాటులో లేకపోవడంతో పోలీసు వాహనంలోనే పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని సమాచారం. ఎస్ఐ శ్రీశైలం స్థానికుల సహాయంతో ట్రాక్టర్‌ను అక్కడి నుంచి తొలగించారు.

బైక్‌ను తప్పించబోయి బస్సును ఢీకొట్టిన కారు..

యాలాల: ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, కారు ఢీకొట్టిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాలు.. సోమవారం సాయంత్రం మంతట్టి నుంచి తాండూరు వైపునకు ఆర్టీసీ బస్సు వస్తుంది. అదే సమయంలో స్విఫ్ట్ డిజైర్ కారులో నలుగురు వ్యక్తులు బషీరాబాద్ వైపు వెళ్తున్నారు. ఎన్కెపల్లి గేటు సమీపంలోని మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీజిల్ ట్యాంకర్ పట్టివేత

మోమిన్‌పేట: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్‌ను మోమిన్‌పేట పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కర్ణాటక పాసింగ్ కల్గిన ఓ డీజిల్ ట్యాంకర్ ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా 6వేల లీటర్ల డీజిల్ నింపుకొని వస్తుండగా మోమిన్‌పేట అంబేడ్కర్ చౌరస్తా వద్ద పోలీసుల తనిఖీలో పట్టుబడింది. డ్రైవర్ శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలో తక్కువ ధరకు డీజిల్ దొరుకుతుండటంతో ఇక్కడికి వచ్చి అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు.

పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగిరాలేదని..

పురుగులమందు తాగి భర్త ఆత్మహత్య


మోమిన్‌పేట: తనపై అలిగిన భార్య పుట్టింటికి వెళ్లిపోయిందనే మనస్తాపంతో భర్త పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకొంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మేకవనంపల్లికి చెందిన మహేశ్(28)కు ఇదే గ్రామానికి చెందిన లక్ష్మితో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా.. ఇరువురికీ సర్ది చెప్పి లక్ష్మిని కాపురానికి పంపించారు. వారం రోజుల క్రితం దంపతులు మళ్లీ గొడవపడ్డారు. దీంతో లక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన మహేశ్ ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఇంట్లో పడిపోయాడు. ఇది గమనించిన తల్లి అంజమ్మ అతన్ని లేపేందుకు ప్రయత్నించగా అప్పటికే చనిపోయాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ స్పష్టంచేశారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో..

వాహనదారుడికి ఒకరోజు జైలు, రూ.3వేల జరిమానా

మర్పల్లి: మద్యం సేవించి బైక్ నడిపిన ఓ వ్యక్తికి ఒకరోజు జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ నామల అశోక్ తీర్పు ఇచ్చారు. మర్పల్లి ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పట్లూర్ గ్రామానికి చెందిన లియాకత్ అలీ (48) మద్యం సేవించి సంగారెడ్డి జిల్లా నుంచి మర్పల్లి మండలం పట్లూర్ వస్తుండగా ఆదివారం రాత్రి మర్పల్లి పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అరెస్టు చేసి సోమవారం కోర్టుకు తరలించారు. వికారాబాద్ కోర్టు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నామల అశోక్.. లియాకత్ అలీకి ఒక్కరోజు జైలుశిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధించారు.

గంజాయి విక్రేత అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

దౌల్తాబాద్: మండల కేంద్రంలో సోమవారం పోలీసులు తనిఖీలు చేపట్టగా ఓ వ్యక్తి వద్ద 950 గ్రాముల గంజాయి పట్టుబడింది. కర్నాటక రాష్ట్రం సేడంకు చెందిన సయ్యద్ యాకుబ్ గతకొంతకాలంగా సరిహద్దున ఉన్న దౌల్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో గంజాయి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో యాకుబ్ సోమవారం దౌల్తాబాద్‌కు గంజాయి తీసుకువస్తుండగా మండల కేంద్రంలోని చెరువుకట్టపై తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ రమేష్ కుమార్‌కు పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి 950 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి రిమాండ్‌కు తరలించారు.

పన్నులు ఎగ్గొడుతున్నారు

- జీపీలకు ట్యాక్స్ చెల్లించని సెల్‌టవర్ల యాజమాన్యాలు
- ఆదాయం కోల్పోతున్న పంచాయతీలు

దౌల్తాబాద్: కోట్ల రూపాయల వ్యాపారం చేసుకుంటున్నప్పటికీ గ్రామ పంచాయతీలకు ఏడాదికోసారి చెల్లించాల్సిన పన్నులను సెల్‌టవర్ యజమాన్యాలు ఎగ్గొడుతున్నాయి దౌల్తాబాద్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పలు కంపెనీలకు చెందిన సుమారు 25 సెల్‌ఫోన్ టవర్లు ఉన్నాయి. ఎప్పుడూ ఇంటి పన్నులు కట్టండంటూ వెంటపడే గ్రామ పంచాయతీ సిబ్బంది టవర్లకు సంబంధించిన పన్నుల వసూలు కోసం ఎందుకు ప్రయత్నించడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలకు ఏడాదికి సుమారు రూ.50వేల నుంచి రూ.60వేల వరకు ఆదాయం రాకుండా పోతోంది. మండల కేంద్రంలోనే మూడు సెల్ టవర్లు ఉన్నాయి. టవర్ ఏర్పాటు చేసే స్థలంలో టవర్‌తో పాటు జనరేటర్, గది నిర్మాణం అంతా కలిపి సుమరు 300 గజాల నుంచి 400 గజాల స్థలం వరకు ఉంటుంది. దీనికి ప్రహరీ కూడా ఏర్పాటు చేస్తారు. ఎంత చిన్న పంచాయతీ అయినప్పటికీ ప్రతి టవర్ యాజమాన్యం ఏడాదికి కనీసం రూ.1000కి పైగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

అనుమతులతో పాటు రూ.10వేలు..

సెల్‌టవర్ నిర్మాణానికి ముందుగా టవర్ ఏర్పాటు చేసిన స్థలానికి సంబంధించిన పత్రాలతోపాటు గ్రామ పంచాయతీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. పంచాయతీకి రూ.10వేలు రుసుము కట్టాల్సి ఉంటుంది. డబ్బులు చెల్లించగానే రసీదు ఇచ్చి అక్కడున్న విస్తీర్ణాన్ని బట్టి ఏడాదికి ఎంత పన్ను అనేది అప్పుడే గుర్తించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రతి ఏడాదికి టవర్ల నుంచి పన్ను కట్టించుకోవాలి. కానీ దౌల్తాబాద్ మండలంలో మాత్రం అలా జరగడంలేదు. సెల్‌టవర్‌కు అద్దెకు ఇచ్చేవారు గ్రామపంచాయతీ సిబ్బందితో ఒప్పందం కుదుర్చుకుని అనుమతి పొందుతున్నారు. దీంతో పంచాయతీకి రావాల్సిన ఆదాయం కోల్పోతున్నారు.



దౌల్తాబాద్‌లోని సెల్‌టవర్

నోటీసులు ఇచ్చాం

సెల్‌టవర్లకు సంబంధించి రావాల్సిన బకాయిలను కార్యదర్శులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికే టవర్ల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చాం. డిమాండు రిజిస్టర్లలో పొందుపరిచి ప్రతి ఏడాది బకాయిల జాబితాలో కనబడేలా చర్యలు తీసుకుంటాము. పంచాయతీకి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటాము. – రవీందర్, ఎంపీఓ, దౌల్తాబాద్

విద్యార్థిని అదృశ్యం

పహాడీషరీఫ్: ఇంటర్మీడియట్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహేశ్వరం ప్రాంతానికి చెందిన బోరిగే ఆనందం కూతురు లయ (16) మహేశ్వరం మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. అక్కడ హాస్టల్ సదుపాయం లేకపోవడంతో ఆమె తుక్కుగూడలో నివాసముంటోంది. ఈ నెల 8న కాలేజీకి వెళ్తున్నాని చెప్పి బయలుదేరిన బాలిక తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కళాశాల, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఎటువంటి ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

వండర్‌లాలో అపశ్రుతి

గుండెపోటుతో ఇంజనీర్ మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: వండర్‌లాలో అపశ్రుతి చోటుచేసుకుంది. రైడ్స్ చేస్తుండగా ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గుండెపోటు వచ్చి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లి జిల్లా కాశీంకోట మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్(26) కూకట్‌పల్లిలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులు దుర్గప్రసాద్, వరప్రసాద్, గణేశ్, శ్రీకాంత్, ప్రశాంత్‌తో కలిసి వండర్‌లాకు వెళ్లారు. రోలర్ క్యాస్టు రైడ్ చేస్తుండగా మనోజ్ కుమార్‌కు ఛాతిలో నొప్పి వచ్చింది. వెంటనే వండర్‌లాలోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం అంబులెన్స్‌లో యంజాల్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గాంధీకి తరలించారు. అప్పటికే మనోజ్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్: మండల పరిధిలోని మోడల్ స్కూల్లో హవర్స్ బేసిక్ టీచర్స్ నియమకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రకాష్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయనశాస్త్రం (కెమిస్ట్రీ) బోధించుటకు ఎమ్మెస్సీ, బీఈడీ చేసినవారు.. ఇంగ్లీష్‌కు ఎంఏ, బీఈడీ, టెట్ చేసినవారు.. గణితానికి బీఎస్సీ, బీఈడీ, టెట్ పూర్తిచేసిన అభ్యర్థులు జినుగుర్తి మోడల్ స్కూల్లో ఈనెల 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 17వ తేదీ(గురువారం)న డెమోక్లాస్ నిర్వహిస్తామని తెలిపారు. వివరాల కోసం ప్రిన్సిపాల్ నంబర్ 80962 26651లో సంప్రదించాలని కోరారు.

చేసిన పనికి డబ్బులివ్వలేదని..

- జేసీబీతో రైల్వేట్రాక్‌ను తొలగించిన కాంట్రాక్టర్
- కరన్‌కోట్ పీఎస్‌లో కేసు నమోదు

తాండూరు రూరల్: చేసిన పనికి డబ్బులు ఇవ్వలేదనే కోపంతో ఓ కాంట్రాక్టర్ ఏకంగా రైల్వేట్రాక్ పట్టాలను జేసీబీ సహాయంతో తొలగించిన సంఘటన తాండూరు మండలం మల్కాపూర్ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక సరిహద్దులోని కల్లూరి గ్రామ శివారులో చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ ఉంది. ఈ ఫ్యాక్టరీకి రైల్వేట్రాక్ నిర్మాణం కొరకు తాండూరు మండలంలోని కోటబాసుపల్లి, గుంతబాసుపల్లి, మల్కాపూర్, సంగెంకలాన్ గ్రామాల మీదగా భూముల నుంచి రైల్వేట్రాక్ నిర్మాంచారు. ప్రసాద్ అనే కాంట్రాక్టర్ ఈ పనులను పూర్తిచేశాడు. అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.5 కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ సోమవారం మల్కాపూర్ శివారులో చెట్టినాడు రైల్వేట్రాక్‌ను జేసీబీ సహాయంతో తొలగించాడు. ఈ వ్యవహారంపై చెట్టినాడు యజమాన్యం కాంట్రాక్టర్ ప్రసాద్‌పై కరన్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్‌పైపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అయితే కాంట్రాక్టర్ కూడా యజమాన్యంపై ఫిర్యాదు చేయడంతో యజమాన్యంపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



చెట్టినాడు రైల్వేట్రాక్‌ను తొలగిస్తున్న కాంట్రాక్టర్

పేదలకు భూమి పంచాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

అఖిల పక్ష నాయకుల తీర్మానం

ఇబ్రహీంపట్నం రూరల్: పోరాడి సాధించుకున్న భూమిని పేదలకు పంచాలని అఖిల పక్ష నాయకులు తీర్మానించారు. సోమవారం మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి సీపీఎం, సీపీఐ బీజేపీ, బీఆర్ఎస్, బీఎస్పీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు వెంకటేశ్, జగన్ మాట్లాడుతూ.. 60 ఎకరాల భూములను పంచిన చరిత్ర సీపీఎంకు ఉందన్నారు. గతంలో భూపోరాటంలో సాధించుకున్న మూడెకరాల భూమిని నాయకత్వం వహించిన డేరంగుల నర్సింహ పేరిట రిజిస్ట్రేషన్ చేయించగా.. ఆయన బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత భూమి తనదే అనడం తగదన్నారు. ముప్పై ఏళ్లుగా గ్రామానికి చెందిన 500 కుటుంబాలు సాగు చేసుకుంటున్న భూమిని తన దుర్బుద్ధితో అతని కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడని ఆరోపించారు. అట్టి భూమిని పేదలకు పంచాలని ఎన్నో సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని పేదలకు చెందిన భూమిని వారికే పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆండాలు, ఎంపీటీసీ సభ్యురాలు మంగ, ఉప సర్పంచ్ జంగారెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు దానయ్యగౌడ్, బీజేపీ నాయకుడు గణేశ్, సీపీఐ నాయకులు యాదయ్య, మాజీ వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి,, అశోక్, నర్సింహ, వెంకన్న, స్వామి, ధనేశ్వర్, బీఎస్పీ నాయకుడు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.